క్లుప్తంగా

ఐసీడీఎస్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ప్రారంభోత్సవ పూజలో జెడ్పీటీసీ అప్పలనాయుడు, అధికారులు

గుర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కేసలి స్వచ్ఛంద సంస్థ భవనంలో ఐసీడీఎస్ కార్యాలయాన్ని అధికారులు తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యలయాన్ని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు మంగళవారం ప్రారంభించారు. నెల్లిమర్ల ఐసీడీఎస్ నుంచి గుర్ల మండలం, చీపురుపల్లి ఐసీడీఎస్ నుంచి గరివిడి మండలాలను విడదీసి, ఈ రెండు మండలాలకు కలిపి ఒక ఐసీడీఎస్ కార్యాలయన్ని ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు ఎంపీడీఓ కల్యాణి, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

నేత్రవైద్య శిబిరం రేపు

బొండపల్లి: శ్రీరామ నవమిని పురస్కరించుకుని మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో విజయనగరానికి చెందిన ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బంది శిబిరంలో సేవలందిస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించను న్నట్లు గ్రామ పెద్దలు పేర్కొన్నారు. సీతారామస్వామి వారికి పట్టు వస్త్రాలను మాజీ ఎంపీ బొత్స ఝాన్సీతో పాటు సీతం కాలేజ్ ప్రిన్సిపాల్ మజ్జి శశిభూషణరావు, ధీర ఫౌండేషన్ అధ్యక్షుడు బొత్స సందీప్ చేతుల మీదుగా సమర్పించనున్నారని తెలిపారు. కల్యాణం అనంతరం అన్న సమారాధన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

రైతుల సహకారంతో పీఏసీఎస్ అభివృద్ధి



మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు

గుర్ల: రైతులందరి సహకారంతో కెల్ల పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) అభివృద్ధి పథంలో నడుస్తోందని ఆ పీఏసీఎస్ అధ్యక్షుడు కె.వి సూర్యనారాయణరాజు అన్నారు. పీఏసీఎస్‌లో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెల్ల సొసైటీ ప్రతి ఏడాది అభివృద్ధిలో నడుస్తోందన్నారు. రైతులకు ఎరువులు, రుణాలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని చెప్పారు. సొసైటీ సీఈఓ మండల శ్రీనివాసరావు, సాంబరాజు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

మెరకముడిదాం: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని చీపురుపల్లి ఐసీడీఎస్ పీఓ కె.వి.ఎస్.ఆర్. రాజేశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోషణ్ పఖ్వాడ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల్లో ఉండే పోషకాల గురించి, వాటిని ఆహారంగా తీసుకుంటే కలిగే ప్రయోజనాలపై గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఎంపీడీఓ పి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజూ తాము తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. చిరుధాన్యాలతో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు తయారుచేసిన వంటకాలను ప్రదర్శించారు. ఏపీఎం కె.ఉమామహేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, నాగమణి పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

దత్తిరాజేరు/ చీపురుపల్లిరూరల్(గరివిడి): దత్తిరాజేరు, గరివిడి కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) వచ్చే విద్యా సంవత్సరంలో 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రిన్సిపాళ్లు శివజ్యోతి, ధనలక్ష్మి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈనెల 29 నుంచి ఏప్రిల్ 20 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందని పేర్కొన్నారు. గరివిడి కేజీబీవీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ప్రవేశాలు కల్పిస్తున్నామని వివరాలకు 79937 50799, 97018 56655 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

గజపతినగరం: వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలను మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయ సమీపంలో బుధవారం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ గార తవుడు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి వెంకటరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అతిథిగా హాజరవుతారని, ఆసరా లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులు తరలిరావాలని కోరారు.

2న దత్తిరాజేరులో..

దత్తిరాజేరు: వైఎస్సార్ ఆసరా సంబరాలను ఏప్రిల్ 2న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు వెలుగు ఏపీఎం అచ్యుతరావు మంగళవారం తెలిపారు. మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, జిల్లా డీఆర్డీఏ పీడీ కల్యాణ్‌చక్రవర్తి అతిథులుగా హాజరవుతారని చెప్పారు. లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

- వైఎస్సార్ ఆసరా సంబరాల్లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి



మహిళలకు చెక్ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, నాయుడుబాబు తదితరులు



ఆసరా సంబరాలకు హాజరైన డ్వాక్రా సంఘాల సభ్యులు

శృంగవరపుకోట: మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రతి మహిళను గౌరవమైన స్థానంలో నిలపాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, వైఎస్సార్ ఆసరా పథకం మహిళల ఆర్థిక స్వావలంబనకు బాసటగా నిలుస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధులు విడుదల సందర్భంగా లక్కవరపుకోట మండల కేంద్రంలోని శాంభవి లేఅవుట్‌లో ఎంపీపీ గేదెల శ్రీనివాసరా వు అధ్యక్షతన మంగళవారం సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో 3,92,706 మంది మహిళలకు రూ.754.12 కోట్లు ఆసరా నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తానని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక మోసం చేశారని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఆడపడుచులకు అన్నగా అండగా నిలిచారని, 2019 ఎన్నికల సమయానికి డ్వాక్రా సంఘాలకు ఉన్న రుణాలను 4 విడతలుగా చెల్లిస్తానని చెప్పి, ఇప్పటికే మూడు విడతల నిధులు విడుదల చేశారని పేర్కొన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మహిళల ఆర్థికాభివృద్ధికి, సాధికారత కోసం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన భోజనం రోజుకో మెనూతో అందిస్తున్నారని, ఫీజులు కట్టి, పుస్తకాలిచ్చి మీ పిల్లల బాధ్యత జగన్ తీసుకున్నారని మహిళలను ఉద్దేశించి అన్నారు. రాష్ట్రంలో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు ఇచ్చి, పదవుల్లో మహిళలను గౌరవంగా నిలబెట్టారన్నారు.

మహిళా సాధికారతకు నిర్వచనం

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ లక్కవరపుకోట మండలంలోని 11,548 మంది సభ్యులకు మూడో విడత వైఎస్సార్ ఆసరా నిధులు రూ.7.50 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. నాడు చంద్రబాబు డ్వాక్రా సంఘాల అప్పులు తీరుస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆ హామీని విస్మరించారని, కానీ సీఎం జగన్ మాత్రం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ నిధులను విడుదల చేస్తున్నారని, ఇదీ ఆయన నిజాయితీ అని అన్నారు. అన్ని పథకాలూ మహిళలకే అందిస్తూ, మహిళా సాధికారతకు జగన్ అసలైన నిర్వచనం చెప్పారని అన్నారు. మన కుటుంబాల బాగుకు జగన్ ముఖ్యమంత్రి కావాలని, ఆయన మీకు చేసిన మేలు గుర్తుంచుకోవాలన్నారు. పేదవాడితోనే నాప్రయాణం, పెద్దలతోనే నాపోరాటం అని చెప్పిన ముఖ్యమంత్రి అదే బాటన నడుస్తున్నారని చెప్పారు.

మహిళల గౌరవం పెంచారు

ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజల ఇబ్బందులను చూసిన జగన్ తాను ముఖ్యమంత్రి అయితే మీ సమస్యలు తీరుస్తానంటూ ఇచ్చిన ప్రతీ మాట అమలు చేశారన్నారు. ప్రతీ పథకం సొమ్ము నేరుగా మహిళల ఖాతాలకు జమ చేస్తూ, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తూ సమాజంలో మహిళల గౌరవాన్ని పెంచారని అన్నారు. అనంతరం డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.7.50 కోట్ల చెక్‌ను అందచేశారు. రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.నాయుడుబాబు, ఏఎంసీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఆవాల శ్యామల, జెడ్పీటీసీ టి.వరలక్ష్మి, సూర్యనారాయణ రాజు, గుమ్మడి సత్యనారాయణ, ఎడ్ల కిశోర్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ రూపేష్, వెలుగు ఏపీఎం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడు విడతల్లో రూ.22.50 కోట్లు



డ్వాక్రా సంఘాలకు నాలుగు విడతల్లో రుణ మాఫీ సొమ్ములు అందిస్తామని ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి అయిన తర్వాత నిలబెట్టుకున్నారు. ఇప్పటికే మండలంలో 1056 మహిళా సంఘాల్లోని 11,548 మంది మహిళలకు మూడు విడతల్లో రూ.22.50కోట్లు పంపిణీ చేశారు.

– తలారి బంగారమ్మ, ఎల్.కోట తలారి గ్రామం, ఎల్.కోట మండలం

రుణపడి ఉంటాం



మూడు విడతలుగా వైఎస్సార్ ఆసరా సొమ్ము ఇచ్చారు. విద్యాదీవెన, వసతి దీవెనతో పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు. నాకు ఇచ్చిన మొత్తంతో రెండు జిగ్,జాగ్ మిషన్లు కొని పనిచేస్తున్నాను, డ్వాక్రా రుణం, బ్యాంక్ లింకేజీతో ఆటో కొన్నాం. నా భర్త ఆటో నడుపుతున్నారు. బ్యాంక్ లోన్ తీర్చేయగా నెలకి రూ.10వేల వరకూ ఆదా చేస్తూ సంతోషంగా ఉన్నాం. జగన్ అన్నకు రుణపడి ఉంటాం..

–కోన వెంకటలక్ష్మి, జమ్మాదేవిపేట గ్రామం, ఎల్.కోట మండలం.

కళ్లద్దాల పంపిణీ



విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు

శృంగవరపుకోట: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఇదివరకు నిర్వహించిన కంటి పరీక్షల్లో కళ్లద్దాలు అవసరమైన వారిని వైద్యాధికారులు గుర్తించారు. వారికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, వెలమ కార్పొరేషన్‌చైర్మన్ నాయుడుబాబు ఎల్.కోటలో మంగళవారం నిర్వహించిన ఆసరా సంబరాల్లో కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. పూర్వం కంటి పరీక్షలు, వైద్యం అనేవి పేదలకు అందని ద్రాక్షగానే ఉండేవని గుర్తు చేశారు. ఇప్పుడు విద్యార్థి దశలోనే స్కూళ్లలో స్క్రీనింగ్ టెస్ట్‌లు ప్రభుత్వం నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలు, శస్త్రచికిత్సలు చేయిస్తోందన్నారు. వైఎస్సార్ ఆసరా కంటి వెలుగు పథకం అద్భుత కార్యక్రమమని చెప్పారు. ఆప్తాలమిస్ట్ తారకేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో ఎరువుల నిల్వల పరిశీలన

గంట్యాడ: మండలంలోని బుడతానపల్లి, రామవరం, నీలావతి, పెణసాం, గొడియాడ తదితర గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్బీకే) ఎరువుల నిల్వలను వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఆన్‌లైన్‌లో ఉన్న ఎరువుల నిల్వలకు, ఆర్బీకేల్లో ఉన్న నిల్వల వివరాలు ఖచ్చితంగా ఉన్నాయా లేదా సరి చూశారు. మండల వ్యవసాయ అధికారి బి.శ్యామ్ కుమార్, మార్క్‌ఫెడ్ అధికారి సుధీర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాసుల వితరణ



గ్లాసులు అందజేస్తున్న సర్పంచ్ రామునాయుడు

వేపాడ: సర్కారు బడుల్లోని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రాగి జావ పంపిణీ చేస్తున్న నేపథ్యంలో చినగుడిపాల సర్పంచ్ బోజంకి రామునాయుడు నీలకంఠరాజపురం ఉన్నత పాఠశాలలోని 100 మంది విద్యార్థులకు తన సొంత నిధులతో మంగళవారం స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు రాగి జావ తాగేందుకు అవసరమైన గ్లాసులను అందించామని చెప్పారు. సర్పంచ్‌కు ఉపాధ్యాయులు, హెచ్‌ఎం కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ నాయుడు బాబు, ఉపసర్పంచ్ లండ దేముడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లండ అప్పన్న పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

శృంగవరపుకోట/ గజపతినగరం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా అవలంభిస్తున్న విధానాలు, కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా చేస్తున్న చట్టాలపై నిరసన తెలుపుతూ ఏప్రిల్ 5న 'చలో ఢిల్లీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. సంబంధిత గోడపత్రికలను ఎస్.కోట గాంధీ పార్కులో, గజపతినగరం మండలం పురిటిపెంట పంచాయతీలో మంగళవారం ఆవిష్కరించారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి వేలాదిగా కార్మికులు తరలి వచ్చి కేంద్రప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతను చాటాలని నాయకులు కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్ సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి



ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

గంట్యాడ: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలు, కులాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, విద్య, వైద్య రంగాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. సీఎం జగన్ లక్ష్యాలకు అనుగుణంగా అంతా పని చేయాలని సూచించారు. అనంతరం ఎంపీపీ పీరుబండి హైమావతి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ కోలగట్లను సన్మానించారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థినులకు సూచనలిస్తున్న జిల్లా గురుకులాల సమన్వయ అధికారి చంద్రావతి

వేపాడ: ఇంటర్, పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో గురుకుల పాఠశాలల విద్యార్థినుల శతశాతం ఉత్తీర్ణతతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా గురుకుల బాలికల పాఠశాలల సమన్వయ అధికారి చంద్రావతి ఆకాంక్షించారు. బక్కునాయుడుపేటలో నిసాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను మంగళవారం ఆమె సందర్శిం చారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఇంటర్, పదోతరగతి విద్యార్థినులతో సమావేశమయ్యారు. పరీక్షలు ఎలా రాస్తున్నారని ఇంటర్ విద్యార్థినుల ను ఆరా తీశారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరుతీసుకురావాలన్నారు. మరి కొద్ది రోజుల్లో పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచిం చారు. ప్రిన్సిపాల్ ఉషారాణి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక



చీపురుపల్లిరూరల్(గరివిడి): ఉపకార వేతనాలకు ఎంపికైన కోనూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు



గంట్యాడ: ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థినులతో ప్రిన్సిపాల్ రామకృష్ణారావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): జాతీయ ప్రతిభ ఉపకార వేతనాలకు (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) గరివిడి మండలంలోని కోనూర ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులు వై.జ్యోత్స్న ఓ.అక్షయ, ఎన్.మనోజ్‌కుమార్ ఎంపికయ్యారని హెచ్‌ఎం టి.వి.జి.కె.మూర్తి మంగళవారం తెలిపారు. ఉపకార వేతనాల కోసం నిర్వహించిన పరీక్షలో ఈ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎంలు చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు ఏడాదికి రూ.12వేల చొప్పున కేంద్రప్రభుత్వం స్కాలర్‌షిప్ అందజేయనుందని పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మోడల్ స్కూల్ నుంచి ముగ్గురు ఎంపిక

గంట్యాడ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు మండలంలోని మోడల్ స్కూల్‌కు చెందిన 8వతరగతి విద్యార్థినులు ముగ్గురు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రామకృష్ణారావు మంగళవారం తెలిపారు. ఎంపికైన డి.సత్యతనూజ, కె.చందనశ్రీ, బి.లోహితను ఆయన అభినందించారు.

పేద,బడుగు,బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి



కొత్తవలస: మిందివలసలో తాగునీటి మోటారును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి



కొత్తవలస: గవరపాలెంలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం, సంతోషమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి గవరపాలెం, మిందివలస గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించా రు. ఎమ్మెల్యే ప్రతీ గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, అవి అందుతున్నాయా లేదా అని ప్రజలను ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగితెలుసుకుని, గ్రామస్తులు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మిందివలసలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన డైరెక్ట్ పంపింగ్ సిస్టమ్‌ను, వీధి కుళాయిలను ప్రారంభించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎం.ఎర్రారామస్వామి, ఉప సర్పంచ్ పి.చెల్లయ్య, వార్డు సభ్యుడు రామకృష్ణ, గనిశెట్టిపాలెం సర్పంచ్ ఈశ్వరరావు, పార్టీ నాయకులు బొంతల వెంకటరావు, పి.ఎస్.ఎన్.పాత్రుడు,రామన్నపాత్రుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు



గజపతినగరం రూరల్: పట్రువాడలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 98 శాతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని, అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని గంగచోళ్లపెంట, పట్రువాడ గ్రామాల్లో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ తమకు పథకాలు అందుతున్నాయని ఆనందంగా చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, కరోనా సంక్షోభ సమయంలో సైతం ఏఒక్క సంక్షేమ పథకాన్ని నిలిపివేయకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని అన్నారు. అనంతరం చంపావతి నదిపై నిర్మిస్తున్న వంతెనను పరిశీలించారు. త్వరగా వంతెన నిర్మాణం పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ అరుణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుదర్శన్, జెడ్పీటీసీ గారతవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బూడి వెంకటరావు, గృహసారథుల మండల కన్వీనర్ సుబ్రహ్మణ్యం, నాయకులు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు,పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ పల్లి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు..

గజపతినగరం మండలంలోని కొనిశ సచివాలయం పరిధి మర్రివలస గ్రామంలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సుదర్శన్ మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొంటారని చెప్పారు. మండల అధికారులు, సంబంధిత సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

సంక్షిప్తంగా...

చింతాడలో 'ఫ్యామిలీ డాక్టర్'

జామి: మండలంలోని చింతాడ గ్రామంలో జామి పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యరేఖ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముందుగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి ఓపీ (అవుట్ పేషెంట్) సేవలు అందించారు. 54 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమి క పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేశా రు. అలాగే గృహ సందర్శన చేసి ప్రజలకు వైద్యతనిఖీలు చేశారు.104 వైద్యాధికారి కుషాల్, ఎంఎల్‌హెచ్‌పీ శివలక్ష్మి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎస్.కోట పంచాయతీలో వేలం పాటలు

శృంగవరపుకోట: స్థానిక పంచాయతీలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బుధవారం ఉదయం, మధ్యాహ్నం రెండు షెడ్యూల్స్‌గా టెండర్లు, వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ఈఓ పాత్రో మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు రోజువారీ మార్కెట్‌కూ రూ. 50,000, వారపుసంతకు రూ.5000, కబేళా 1,000, సులభ్ కాంప్లెక్స్ రూ.5,000, చింత చెట్టు కలపకు రూ.5000 ధరావత్తు చెల్లించి వేలం పాటలో హాజరు కావాలన్నారు. షెడ్యూల్–2లో స్టేషనరీ సరఫరాకు రూ.500, పారిశుద్ధ్య సిబ్బందికి యూనిఫాం, చెప్పులు సబ్బులు సరఫరాకు ఒక్కోదానికి రూ.500, విద్యుత్ సామగ్రి కొనుగోలుకు, పీడబ్ల్యూఎస్ సామగ్రి సప్లయికి, రూ.30 వేలు, పార్క్‌వాచ్‌మన్ నిర్వహణకు రూ.1000, పారిశుద్ధ్య సిబ్బంది నిర్వహణకు రూ.5వేలు, కాంట్రాక్ట్ వాచ్‌మన్, ప్లంబర్, హెల్పర్ల నిర్వహణకు రూ.2వేలు, కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్స్ నిర్వహణకు రూ.3వేలు, ప్రజారోగ్య వాహనాల నిర్వహణకు రూ.4వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని, పాటదారులు పంచాయితీ ఈఓచే జారీ చేయబడిన సాల్వెన్సీతో హాజరు కావాలన్నారు. పంచాయతీకి బకాయి పడ్డవారు, వారి కుటుంబ సభ్యులు పాటలో హాజరయ్యేందుకు అర్హులు కారని తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



లైబ్రేరియన్ శ్రీధర్‌కు పుస్తకాలు అందజేస్తున్న దాత ఉదయ్‌కుమార్

శృంగవరపుకోట: స్థానిక శాఖా గ్రంథాలయానికి పట్టణానికి చెందిన నాచు ఉదయ్‌కుమార్, అతని సోదరులు పుస్తకాలు వితరణ చేశారు. రూ.6000 విలువ చేసే పోటీ పరీక్షల పుస్తకాలను లైబ్రేరియన్ శ్రీధర్‌కు మంగళవారంఅందచేశారు. దాతలను లైబ్రేరియన్ అభినందించారు.

చామలవలసలో సర్వే

బొండపల్లి: మండలంలోని చామలవలస గ్రామంలో సమగ్ర భూరీసర్వేలో భాగంగా ఇప్పటికే భూసర్వే, డ్రోన్ సర్వే పూర్తయింది. గ్రామంలోని ఇళ్ల సర్వేను ఈఓపీఆర్డీ సీహెచ్.సుగుణాకరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, సర్వేసిబ్బంది మంగళవారం ప్రారంభించారు. డ్రోన్ సర్వే ద్వారా చేసిన మ్యాపింగ్ ఆధారంగా గ్రామంలోని ప్రతీ ఇంటితో పాటు ప్రభుత్వ స్థలాలు, భవనాలు అన్నింటినీ క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్పంచ్ తాడ్డి రమణమ్మ, నాయకులు తాడ్డి ప్రకాశరావు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక

గుర్ల: మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి నిర్వహించిన సోషల్ ఆడిట్‌పై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. పలుగ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా నాటిన మొక్కల వివరాలు రికార్డుల్లో ఎక్కువగా ఉన్నాయని, క్షేత్రస్థాయిలో తక్కువ మొక్కలు ఉన్నాయని ఆడిట్ అధికారులు ఏపీడీ శారదాదేవి దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధి పనులు చేసిన ప్రదేశంలో పని విలువ, వివరాలకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయలేదన్నారు. జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, చీపురుపల్లి ఏపీడీ లక్ష్మణరావు, డీపీఓ రవీంద్ర, ఎంపీడీఓ కల్యాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, అంబల్ల చిన్నారావు పాల్గొన్నారు.

వేల పాట నేటికి వాయిదా

గజపతినగరం: స్థానిక పంచాయతీలో రోజువారీ మార్కెట్‌లో ఆశీల వసూళ్లకు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ వేల పాటలో ప్రభుత్వం నిర్ధారించిన మొత్తం కంటె తక్కువగా పాటదారులు పాడడంతో వేలం పాటను బుధవారం నాటికి వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి రమణ తెలిపారు. మార్కెట్ రోజువారీ ఆశీల వసూళ్లకు సర్కారు రూ. 3.15లక్షలు కనీస పాటగా నిర్ధారించగా పాటదారులు రూ.1.20 లక్షల వరకే పాడడంతో వేలం పాటనువాయిదా వేశారు.

31 సర్వసభ్యసమావేశం

కొత్తవలస: కొత్తవలస మేజర్ పంచాయతీ సర్వసభ్య సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈఓ కన్నబాబు మంగళవారం ఓ ప్రకటపలో తెలిపారు.సర్పంచ్ మచ్చ ఎర్రారామస్వామి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి వార్డు సభ్యులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ బంద అక్రమణపై ఫిర్యాదు

బొండపల్లి: మండల కార్యాలయాలకు ఆనుకొని జాతీయ రహదారి–26కు పక్కనగల ప్రభుత్వానికి చెందిన బంద ఆక్రమణకు గురైందంటూ డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శంకరావుకు బగ్గా ఎర్రయ్య ఫిర్యాదు చేశారు. దీనిపై డీటీ స్పందిస్తూ సర్వే నంబర్ 6–16లో ప్రభుత్వ బందను కొంతమంది ఆక్రమించి మట్టితో కప్పివేసినట్టు గుర్తించామని తెలిపారు. అక్రమణదారుకు నోటీసులు జారీచేశామన్నారు.